## క్లుప్తంగా

### బాధ్యతల స్వీకరణ


బాధ్యతలు చేపట్టిన నూతన సీఐ వంశీధర్

శిరివెళ్ల: నూతన సీఐగా సోమవారం వంశీధర్ బాధ్యతలను స్వీకరించారు. గత సీఐ చంద్రబాబు నాయుడు జిల్లా ఫ్యాక్షన్‌జోన్‌కు బదిలీ కావడంతో ఆయన స్థానంలో వంశీధర్‌ను నియమించారు. ఈయన చిత్తూరు జిల్లా చంద్రగిరి స్టేషన్ ఎస్ఐగా పని చేస్తూ సీఐగా పదోన్నతిపై ఇక్కడికి వచ్చారు. కాగా సీఐని ఎస్ఐ సురేష్, రుద్రవరం ఎస్ఐ శరత్‌కుమార్‌రెడ్డి మర్యాద పూర్వకంగా కలిశారు.

### 'స్పందన' దరఖాస్తుల పరిశీలన

ఉయ్యాలవాడ : జిల్లా స్థాయి స్పందన కార్యక్రమంలో ప్రజల నుంచి వచ్చిన దరఖాస్తులపై సోమవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో పరిశీలన చేపట్టారు. ఈ నెల 6న జిల్లా కలెక్టర్ మన్‌జీర్ జిలానీ శామూన్ ఆధ్వర్యంలో ఉయ్యాలవాడలో జగనన్నకు చెబుదాం- స్పందన కార్యక్రమం జిల్లా స్థాయి అధికారులతో నిర్వహించిన విషయం తెలిసిందే. ఈ మేరకు ప్రజల నుంచి వచ్చిన 62 దరఖాస్తులు పరిష్కారం కోసం ఆన్‌లైన్‌లో నమోదు అయ్యాయని ఎంపీడీఓ ఉమామహేశ్వరరావు, తహసీల్దార్ రవికుమార్ తెలిపారు. వీటిపై మండల స్థాయి అధికారులతో విచారణ చేపట్టి, క్షేత్రస్థాయికి వెళ్లి బాధితులకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు.

### రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక


రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులు

నంద్యాల(న్యూటౌన్): జిల్లాస్థాయి బాక్సింగ్ పోటీల్లో బాలా అకాడమీ విద్యార్థులు విజయం సాధించి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికై నట్లు పాఠశాల ప్రిన్సిపాల్ మాధవీలత సోమవారం తెలిపారు. ఆమె మాట్లాడుతూ నంద్యాల పట్టణంలోని కేఎస్ఎం మున్సిపల్ హైస్కూల్ క్రీడా మైదానంలో ఈనెల 7వ తేదీన జరిగిన బాక్సింగ్ పోటీల్లో జూనియర్ విభాగంలో రంజాన్ షరీఫ్, అనుమల్లా జైర్, అశ్వీన్, సీనియర్ విభాగంలో బాలురు అబూస్ పియాన్, తౌఫిక్, మదన్ సుగుమారెడ్డి, జోహెబ్, బాలికల సీనియర్ విభాగంలో మౌనిక, అఫియా, ప్రియాంక, సుహాన, నాగమల్లేశ్వరి, దీపిక, చరణ్యలు ప్రతిభ చాటినట్లు తెలిపారు. వీరిని పాఠశాల కోచ్ మహేష్, ఉపాధ్యాయులు అభినందించారు.

### ప్రభుత్వ ఆసుపత్రుల్లో మెరుగైన వైద్య సేవలు


అన్నదానం చేస్తున్న దృశ్యం

గోస్పాడు: ప్రభుత్వ ఆసుపత్రుల్లో మెరుగైన వైద్య సేవలు అందుబాటులో ఉన్నాయని, వీటిని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని వైఎస్సార్‌సీపీ మహిళా విభాగం నంద్యాల జిల్లా అధ్యక్షురాలు బెక్కెం శకుంతలమ్మ అన్నారు. మండలంలోని యాళ్లూరు సీహెచ్‌సీలో సోమవారం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఆస్పత్రి వైద్యులు రాజేష్, మాధవీ ప్రసన్న, శివాని, శ్రీనివాసులు ఆధ్వర్యంలో గర్భిణులు, బాలింతలకు వైద్య సేవలు అందించారు. ప్రభుత్వం పేద ప్రజల కోసం నాణ్యమైన వైద్య సేవలు అందించిన లక్ష్యంతో ప్రత్యేకంగా వైద్య శిబిరాలు ఏర్పాటు చేస్తోందని తెలిపారు.

### ఆరోగ్య సురక్షకు విశేష స్పందన


మందులు పంపిణీ చేస్తున్న సర్పంచ్

నంద్యాల(అర్బన్): నంద్యాల మండలం భీమవరం గ్రామంలో సోమవారం నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరానికి విశేష స్పందన లభించింది. 682 మందికి వైద్య సిబ్బంది చికిత్సలు అందించి, ఉచితంగా మందుల పంపిణీ చేశారు. గ్రామ సర్పంచ్ గోపవరం భక్తవత్సలమ్మ, ఎంపీడీఓ సుగుణశ్రీలు ఆరోగ్య సురక్ష శిబిరాన్ని ప్రారంభించారు. డాక్టర్లు ఉదయసంధ్యా, వెంకటేశ్వర్లు, అనిత, సౌమ్య, ఫార్మాసిస్టులు, సిబ్బంది పేదలకు వైద్య పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో ఈఓ ఆర్‌డీ మహిధర్‌రెడ్డి, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ఆరోగ్యమ్మ, గ్రామ వైఎస్సార్‌సీపీ నాయకులు చంద్రశేఖర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

### అంగన్‌వాడీల్లో యాప్‌ను రద్దు చేయాలి

గోస్పాడు: అంగన్‌వాడీ సెంటర్లలో అమలు చేస్తున్న ఎఫ్ఆర్ఎస్ యాప్‌ను రద్దు చేయాలని అంగన్‌వాడీ టీచర్లు రమణమ్మ ,శివలీల, లక్ష్మీదేవి ఆధ్వర్యంలో బాలింతలు, గర్భిణులు పంచాయతీ కార్యదర్శికి సోమవారం వినతిపత్రం అందజేశారు. టేక్ హోం రేషన్‌లో భాగంగా యాప్‌ను రద్దుచేసి సంతకాలు పెట్టి సరుకులు తీసుకోవడానికి అవకాశం కల్పించాలని కోరారు.

# సురక్షతో 'సూపర్' వైద్యం

- పేదలకు ఆరోగ్య సేవలో కొత్త పుంతలు
- జగనన్న ఆరోగ్య సురక్ష ద్వారా 10 రోజుల్లో నియోజకవర్గంలో 31 వైద్య శిబిరాలు
- 10,106 మందికి వైద్య సేవలు


ఆళ్లగడ్డ వైద్య శిబిరంలో మహిళలకు వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న గైనకాలజిస్టు డాక్టర్ సుజాత

ఆళ్లగడ్డ : గ్రామీణ ప్రాంతాల్లోని పేదలు కొన్ని ఆరోగ్య సమస్యలు ఉన్నప్పటికీ వాటిని తేలిగ్గా తీసుకుని వైద్యం చేయించుకోవడంలో నిర్లక్ష్యం చేస్తుంటారు. మరి కొంత మంది వ్యాధి ఏమిటో తెలుసుకోకుండా అస్వస్థతకు లోనైనప్పుడు ఏదో ఒక మాత్ర వేసుకుని వ్యాధి ముదిరేవరకు ఇబ్బంది పడుతుంటారు. ఈ నేపథ్యంలో అటువంటి వారికి స్పెషలిస్ట్ వైద్యులతో సూపర్ స్పెషాలిటీ వైద్య సేవలు అందించేందుకు ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకు వచ్చిన 'జగనన్న ఆరోగ్య సురక్ష' కార్యక్రమానికి అనూహ్య స్పందన లభిస్తోంది. సాధారణ ఆరోగ్య సమస్యలతో పాటు దీర్ఘకాలిక వ్యాధ్యులు, గుండె, కాలేయం, నరాలు, ఊపిరితిత్తులు, మెదడు, గర్భకోశ వ్యాధి, రక్తహీనత.. ఇలా వ్యాధి ఏదైనా ముందుగా గుర్తించి సకాలంలో వైద్యం అందించడమే లక్ష్యంగా శిబిరాల్లో మందులు అందజేయడం ద్వారా వారి ఆరోగ్యానికి ప్రాధాన్యమిస్తున్నారు.

**31 వైద్య శిబిరాలు 10,106 మందికి పరీక్షలు**

నియోజకవర్గం వ్యాప్తంగా గత నెల 30వ తేదీ నుంచి ప్రారంభమైన జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాలను పట్టణ, గ్రామీణ ప్రజలు పూర్తిస్థాయిలో సద్వినియోగం చేసుకుంటున్నారు. వలంటీర్లు, వైద్య సిబ్బంది ఇంటింటి సర్వే చేసి స్థానికంగా శిబిరాలు ఏర్పాటు చేసి వైద్య సేవలు అందిస్తుండటంపై ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. నియోజకవర్గ వ్యాప్తంగా ఆళ్లగడ్డ మున్సిపాలిటీతో పాటు ఆరు మండలల పరిధిలో ఈ నెల 30వ తేదీ నుంచి జగనన్న ఆరోగ్య సురక్ష క్యాంపులు నిర్వహిస్తున్నారు. ఇంతవరకు 31 క్యాంపులు నిర్వహించారు.

**ముమ్మరంగా సర్వే..**

నియోజవర్గంలోని ఆరు మండాలల పరిధిలో జగనన్న ఆరోగ్య సురక్ష సర్వే ముమ్మరంగా సాగుతోంది. ఏఎస్ఎంలు, వలంటీర్లు జగనన్న ఆరోగ్య సురక్ష యాప్ డౌన్‌లోడ్ చేసుకుని సర్వే చేస్తున్నారు. వారి ఇంటి వద్దే కుటుంబ సభ్యులందరికీ పార్టీలు, వర్గాలకు అతీతంగా ఏడు రకాల వైద్యపరీక్షలు నిర్వహిస్తున్నారు. ఆ కుటుంబంలోని వ్యక్తి సెల్‌ఫోన్‌లో జగనన్న సురక్ష యాప్ డౌన్‌లోడ్ చేసి సర్వే వివరాలు అందులో అప్‌లోడ్ చేస్తున్నారు.


ఓబులంపల్లె ఎస్సీ కాలనీలో సర్వేలో భాగంగా వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న దృశ్యం

ఈ క్యాంపుల్లో 10,106 మంది స్పెషలిస్ట్ వైద్యుల వద్ద వైద్య సేవలు పొందారు. ఇందులో 364 మందికి మెరుగైన వైద్యం అవసరమని గుర్తించి ఆరోగ్యశ్రీ నెట్‌వర్క్ ఆసుపత్రులకు రెఫర్ చేశారు.

**క్యాంపుల్లో వైద్య సేవలు ఇలా..**

స్థానికంగా ఏర్పాటు చేస్తున్న వైద్య శిబిరాల్లో ఇద్దరు స్పెషలిస్ట్ వైద్యులు, స్థానిక పీహెచ్‌సీ వైద్యులు ఇద్దరు వైద్యులు సేవలు అందిస్తున్నారు. నియోజవర్గంలో మొత్తం 324 వైద్యులు, 162 మంది స్పెషలిస్టు వైద్యులు శిబిరాల్లో సేవలందిస్తున్నారు. ఆర్థోపెడిక్, కంటి, జనరల్ మెడిసిన్, జనరల్ సర్జన్, గైనకాలజిస్ట్, చిన్న పిల్లల వైద్యులు, ఇలా విభాగా లు ఏర్పాటు చేసి వైద్య పరీక్షలు నిర్వహిస్తున్నారు.

**14 రకాల పరీక్షలు.. 120 రకాల మందులు**

ఆరోగ్య శిబిరాలకు వచ్చిన వారికి 14 రకాల వైద్య పరీక్షలు నిర్వహించి వారికి అవసమైన 120 రకాల మందులు ఉచితంగా అందజేస్తున్నారు. దీర్ఘకాలిక రోగులకు నెలకు సరిపడా మందులు ఇచ్చి పంపిస్తున్నారు.

### ఆరోగ్యశ్రీ ఆసుపత్రికి రెఫర్ చేశారు



గ్రామంలో జగన్న ఆరోగ్య సురక్ష క్యాంపులో వైద్యం కోసం వస్తే పరీక్షలు చేసిన వైద్యులు ఈసీజీ తీశారు. గుండె సక్రమంగా పనిచేస్తుందో లేదో చూడటానికి అవసమైన పరీక్షలు చేయించుకునేందుకు ఆరోగ్యశ్రీ ఆసుపత్రికి రెఫర్ చేశారు. అక్కడ ఉచితంగా వైద్య పరీక్షలు చేసేలా లెటర్ రాసి ఇచ్చారు. ఇంతటి మంచి కార్యక్రమం చేపట్టిన సీఎంకు రుణపడి ఉంటాం.– **నాగేశ్వరరావు, మిట్టపల్లె**

### సీఎం రుణం తీర్చుకోలేం



బీపీ ఎక్కువై మెదడులో నరాలు చిట్లిపోయాయి. కర్నూలుకు వెళ్లి పరీక్షలు చేయించుకోవాలంటే చాలా ఇబ్బంది పడుతున్నాం. ఇప్పుడు మా ఊరుకే నరాల స్పెషలిస్ట్ వచ్చి పరీక్షలు నిర్వహిస్తారని టోకెన్ ఇచ్చారు. అవసరమైతే పెద్ద ఆసుపత్రికి తీసుకు పోయి ఉచితంగా వైద్య సేవలు అందిస్తారని చెప్పారు. సీఎం రుణం తీర్చుకోలేం. – **వడ్ల రమణయ్య, ఆర్ కృష్ణాపురం**

### సద్వినియోగం చేసుకోవాలి

వ్యాధిగ్రస్తులను గుర్తించి మెరుగైన వైద్య సేవలు అందించడమే జగనన్న ఆరోగ్య సురక్ష ప్రధాన ధ్యేయం. ఇందులో భాగంగా ఇంటింటి సర్వే పగడ్బందీగా నిర్వహిస్తున్నాం. ఈ నెల 30 నుంచి షెడ్యూల్ ప్రకారం ఆరోగ్య శిబిరాలు నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నాం. ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి
– **డాక్టర్ నాగమస్తాన్, వైద్యాధికారి**

### నేడు 'జగనన్న ఆరోగ్య సురక్ష'

దొర్నిపాడు: మండలంలోని బుర్రారెడ్డిపల్లె సచివాలయ పరిధిలో మంగళవారం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ సుబ్బారెడ్డి సోమవారం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన గ్రామానికి చేరుకొని సురక్ష శిబిరం ఏర్పాట్లను పరిశీలించారు. స్పెషలిస్టు వైద్యులు వస్తున్నందున స్థానికులు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

రుద్రవరం: మండల పరిధిలోని చిన్నకంబలూరులో మంగళవారం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో భాగంగా వైద్య శిబిరం ఏర్పాటు చేస్తామని రుద్రవరం పీహెచ్‌సీ వైద్యధికారి ప్రసాదు సోమవారం తెలిపారు. రోగులకు పలు రకాల వైద్య పరీక్షలు నిర్వహించి మందులు ఉచితంగా అందిస్తామన్నారు. కార్యక్రమం నిర్వాహణకు సంబంధించి పంచాయతీ కార్యదర్శి కళావతి తగిన ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు.

**నేడు సుద్దమల్లలో..**

ఉయ్యాలవాడ: మండలంలోని సుద్దమల్ల గ్రామ సచివాలయ పరిధిలో మంగళవారం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని ఉదయం 9 గంటలకు ప్రాథమిక పాఠశాల ఆవరణలో నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ ఉమామహేశ్వరరావు తెలిపారు. ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

### కోలుకోలేక లైన్‌మన్ మృతి


సుబ్బారెడ్డి(ఫైల్)

నంద్యాల(అర్బన్): రోడ్డు ప్రమాదంలో గాయపడిన అయ్యలూరు గ్రామానికి చెందిన లైన్‌మన్ సుబ్బారెడ్డి సోమవారం మృతి చెందాడు. రూరల్ విద్యుత్ శాఖ కార్యాలయ పరిధిలోని అయ్యలూరు గ్రామంలో ఈనెల 1న మీటర్లకు రీడింగ్ స్కాన్ చేసేందుకు వెళ్తుండగా రోడ్డు ప్రమాదానికి గురై గాయపడ్డాడు. చికిత్స నిమిత్తం శాంతిరాం జనరల్ ఆసుపత్రిలో చేర్పించారు. అక్కడ చికిత్స పొందుతూ కోలుకోలేక సుబ్బారెడ్డి మృతి చెందాడు.

### మహిళకు జైలు శిక్ష

నంద్యాల(వ్యవసాయం): దారిన పోయే వారిపట్ల అసభ్యకరంగా ప్రవర్తిస్తూ పౌరులకు ఇబ్బంది కలిగించిన ఓ మహిళకు సెకెండ్ క్లాస్ మెజిస్ట్రేట్ రామిరెడ్డి గారి రాంభూపాల్‌రెడ్డి జైలు శిక్ష విధించినట్లు పోలీసులు తెలిపారు. వివరాలు ఇలా.. నివర్తి నగర్‌కు చెందిన కోల మేరి ఎన్‌జీఓ కాలనీ వద్ద దారిన పోయే వారిపట్ల అసభ్యకరంగా ప్రవవర్తిస్తుండటంతో కొందరు టూ టౌన్ పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు నిందితురాలిపై న్యూసెన్స్ కేసు నమోదు చేసి, సెకెండ్ క్లాస్ కోర్టులో జడ్జి ముందు హాజరు పరచారు. జడ్జి ఆమెకు 8 రోజులు జైలు శిక్ష విధించారు.

### సుకన్య సమృద్ధితో బాలికలకు రక్ష

నంద్యాల(అర్బన్): సుకన్య సమృద్ధి పథకం బాలికలకు శ్రీరామ రక్ష లాంటిదని మహికిషోర్ ఫౌండేషన్ చైర్మన్ మహేశ్వరమ్మ అన్నారు. సోమవారం ప్రపంచ తపాల దినోత్సాన్ని పురస్కరించుకుని 22 మంది బాలికలకు సుకన్య యోజన పథక ఖాతా లను ప్రారంభించారు. బాలికలకు ఖాతా పుస్తకాలను పోస్టుమాస్టర్ వెంకటేశ్వర్లు అందజేశారు. కార్యక్రమంలో పోస్టాఫీసు సిబ్బంది ఆదినారాయణ, సరస్వతి బాలికల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

### క్యాన్సర్‌పై అవగాహన

నంద్యాల(న్యూటౌన్): పట్టణంలోని రావూస్ జూనియర్ మహిళా కళాశాలలో సోమవారం రోటరీ క్లబ్, ఉదయానంద కార్కినోస్ క్యాన్సర్ సెంటర్ ఆసుపత్రి ఆధ్వర్యంలో విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. సదస్సులో రోటరీ క్లబ్ అధ్యక్షులు దండె దస్తగిరి మాట్లాడుతూ రోటరీ క్లబ్ ఇంటర్నేషనల్ తరపున రూ.60లక్షలతో ఉదయానంద ఆసుపత్రిలో క్యాన్సర్ టెస్టింగ్ సెంటర్‌ను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. మహిళలు, విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. డాక్టర్ గీతావాణి, సుస్మిత, డాక్టర్ వీవీ సుబ్బారెడ్డి పాల్గొన్నారు.

### సర్క్యులర్‌ను రద్దు చేయాలి

నంద్యాల(న్యూటౌన్): వీఓఏల కాల పరిమితి సర్క్యులర్ రద్దు చేసి సీబీఓహెచ్ఆర్ పాలసీ అమలు చేయాలని కోరుతూ ఈనెల 10, 11వ తేదీల్లో 36 గంటల ధర్నాతో పాటు వంట వార్పు కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఏపీ వెలుగు వీఓఏ యానిమేటర్స్ సంఘం జిల్లా అధ్యక్ష కార్యదర్శులు నందిపల్లె సోమన్న, మిట్నాల తిరుపతయ్య తెలిపారు. సోమవారం స్థానిక సీఐటీయూ కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. ధర్నా కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

## 'స్పందన' దరఖాస్తులను సత్వరమే పరిష్కరించండి


అధికారులతో మాట్లాడుతున్న ఇన్‌చార్జ్ కలెక్టర్ రాహుల్‌కుమార్‌రెడ్డి

నంద్యాల: జగనన్నకు చెబుదాం – స్పందన విజ్ఞప్తులపై వెంటనే స్పందించి, అర్జీదారులు సంతృప్తి చెందే స్థాయిలో పరిష్కరించాలని ఇన్‌చార్జ్ కలెక్టర్ రాహుల్ కుమార్ రెడ్డి సంబంధిత అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లోని వైఎస్సార్ సెంటినరీ హాలులో ప్రజా ఫిర్యాదుల స్వీకరణ స్పందన కార్యక్రమం నిర్వహించారు. అనంతరం జిల్లా అధికారులతో సమీక్షలో ఆయన మాట్లాడుతూ స్పందన కార్యక్రమాన్ని ప్రాధాన్యతగా తీసుకొని అర్జీదారుల సమస్యలను పరిష్కరించడంలో ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. మెరుగైన ఫలితాలు కనబడాలని సూచించారు. స్పందనలో 184 దరఖాస్తులు వచ్చాయి. జెడ్పీ డిప్యూటీ సీఈఓ సుబ్బారెడ్డి, జిల్లాస్థాయి ఉన్నత అధికారులు పాల్గొన్నారు.

## రెడ్ నెపియర్‌తో పాల దిగుబడి అధికం


వెంకటసుబ్బారెడ్డి, సహాయ సంచాలకులు

నంద్యాల(సెంట్రల్): రెడ్ నెపియర్ గడ్డిలో పోషకవిలువలు అధికంగా ఉండటంతో పాల దిగుబడి అధికమవ్వడంతో పాటు పశువు ఆరోగ్యంగా ఉంటుందని నంద్యాల ప్రాంతీయ పశువైద్యశాల సహాయ సంచాలకులు వెంకటసుబ్బారెడ్డి అన్నారు. సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. ప్రస్తు త కాలంలో సాధారణ ఆకుపచ్చ నెపియర్ రకాలతో పాటు పాడి రైతులు రెడ్ నెపియర్ సాగు చేస్తున్నారన్నారు. దీనిని ఉపయోగించడంతో రైతులు అధిక పాల దిగుబడిని పొందుతున్నారని చెప్పారు. కాండం నుంచి ఆకుల వరకు ఎరుపు రంగులో ఉండి ఆకర్షణీయంగా ఉండటం, ఎదుగుదల వేగంగా ఉండి, ఏపుగా పెరుగుతుందన్నారు. సుమారు 8 నుంచి 10 అడుగుల ఎత్తు వరకు పెరుగుతుందని తెలిపారు. మిగతా రకాలతో పోలిస్తే ఆకులు వెడల్పుగా ఉండి, చౌడు భూముల్లో కాకుండా అన్ని రకాల నేలల్లో పెరుగుతుందని తెలిపారు. బెట్టను తట్టుకోవటంతో పాటు అధిక శాతం ప్రొటీన్ కలిగి ఉండటం(16 నుంచి 18 శాతం), అధిక దిగుబడి ఇవ్వటం (180 నుంచి 190 టన్నులు) దీని ప్రత్యేకత అని చెప్పారు. రైతులు పశుగ్రాసాలకు కేటాయించిన మొత్తం భూమిలో అధిక శాతం ఆకుపచ్చ పశుగ్రాసాలతో పాటు కొంత భాగం రెడ్ నెపియర్‌కు కేటాయించుకోవాలని సూచించారు.

### కేంద్రంపై ఒత్తిడి పెంచాలి

నంద్యాల(సెంట్రల్): కృష్ణా నదీ జలాల విషయంలో బచావత్ ట్రిబ్యునల్ కేటాయింపులు, ఆంధ్రప్రదేశ్ విభజన చట్టంలోని అంశాలను అమలు పర్చేలా కేంద్రంపై రాష్ట్ర ప్రభుత్వం ఒత్తిడి తీసుకురావాలని రాయలసీమ సాగునీటి సాధనా సమితి అధ్యక్షుడు బొజ్జా దశరథ రామిరెడ్డి అన్నారు. కృష్ణా జలాల్ని పునః పంపిణీ చేయాలని కేంద్రం తాజాగా మంత్రివర్గంలో తీసుకున్న నిర్ణయంపై సోమవారం పట్టణంలోని సమితి కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. భాజపా ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. సమావేశంలో ఉపాధ్యక్షులు వై.ఎస్.రెడ్డి, ఏరువ రామచంద్రారెడ్డి, కార్యవర్గ సభ్యులు కొమ్మా శ్రీహరి, మహేశ్వరరెడ్డి, పట్నం రాముడు, భాస్కర్‌రెడ్డి పాల్గొన్నారు.

### వ్యక్తిగత ఖాతాల్లో జమ చేయాలి

నంద్యాల(న్యూటౌన్): ఉపాధ్యాయుల సరెండర్ లీవ్‌లను వారి వ్యక్తిగత ఖాతాల్లో వెంటనే జమ చేయాలని పీఆర్‌టీయూ నంద్యాల జిల్లా ప్రధాన కార్యదర్శి కృష్ణారావు కోరారు. సోమవారం స్థానిక కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ సరెండర్ లీవ్ కోసం దరఖాస్తు చేసి ఏడాది దాటి పోయినా జమ చేయలేదన్నారు. పీఎఫ్ రుణాలు, ఏపీజీఎల్ఐ రుణాలు త్వరగా మంజూరు చేయాలన్నారు. ప్రతి నెల 1వ తేదీనే వేతనాలు చెల్లించాలని కోరారు. ఎఫ్ఎల్ఎన్ రెండో విడత శిక్షణ దసరా సెలవులో ఉన్నందున వాయిదా వేయాలని వారు కోరారు. సమావేశంలో ఉపాధ్యాయ సంఘాల నాయకులు భాస్కరరెడ్డి, విజయరావు, జేసీ నరసింహులు, సుమయూన్ పాల్గొన్నారు.

### ఈ- కేవైసీ తప్పనిసరి

చాగలమర్రి: మండలంలో ఈ-క్రాప్ నమోదు చేయించుకున్న ప్రతి రైతు ఈ-కెవైసీ తప్పనిసరిగా చేయించుకోవాలని ఏఓ రంగ నేతాజీ తెలిపారు. లేకపోతే ప్రభుత్వ పథకాలు వర్తించవని చెప్పారు. మండలంలో 5,357 మంది రైతులకు గాను 4,744 మంది ఈ-కెవైసీ పూర్తి చేసుకున్నారన్నారు. మిగతా రైతులు మంగళవారం సాయంత్రం 3 గంటల లోపు నమోదు చేసుకునేందుకు అవకాశముందన్నారు.

## మారని తీరు..!


ఉదయం 10 గంటలైనా తెరుచుకోని చాగలమర్రి 2వ అంగన్‌వాడీ సెంటర్

చాగలమర్రి: విధుల్లో నిర్లక్ష్యం వహిస్తున్న అంగన్‌వాడీ కార్యకర్తలు, సహాయకులకు అధికారులు మెమోలు ఇస్తున్నప్పటికీ కొందరి తీరు మాత్రం మారడంలేదు. మండల కేంద్రమైన చాగలమర్రిలోని కొన్ని అంగన్‌వాడీ కేంద్రాలను సోమవారం సాక్షి పరిశీలించగా 5వ అంగన్‌వాడీ కేంద్రంలో ఉదయం 9.45 గంటలకు కార్యకర్త, సహాయకురాలు మాత్రమే ఉన్నారు. 4వ కేంద్రంలో సహాయకురాలు మాత్రమే ఉన్నా, కార్యకర్త, పిల్లలు లేరు. కార్యకర్త రాలేదా? అని సహాయకురాలిని ప్రశ్నించగా, కూరాగాయల కోసం వెళ్లిందని తెలపడం హాస్యాస్పందంగా ఉంది. 2వ అంగన్‌వాడీ కేంద్రం ఉదయం 10.00 గంటలైనా అసలు తెరవనే లేదు.

### బాల్యవివాహాలు చట్టరీత్యా నేరం


పోస్టర్ విడుదల చేస్తున్న దృశ్యం

నంద్యాల(అర్బన్): పెళ్లీడు రాకుండా బాల్యవివాహాలు చేయడం చట్టరీత్యా నేరమని జిల్లా బాలల హక్కుల పరిరక్షణ అధికారి (డీసీపీఓ) శారద అన్నారు. సోమవారం పట్టణంలోని బర్న్స్ కాన్ఫరెన్స్ హాల్‌లో బాల్య వివాహాలపై బాలికలకు అవగాహన సదస్సు నిర్వహించారు. శామ్యూల్ దివాకర్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ బాల్య వివాహాలు చేసుకోవడంపై జరిగే అనర్థాలను బాల బాలికలు తెలుసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. సమాజంలో స్త్రీ, పురుషులు సమానమేనని, లైంగిక అసమానతలకు తావు లేదన్నారు. సీడీపీఓ లీలావతి మాట్లాడుతూ సమాజంలో వస్తున్న సమస్యలను ఎదుర్కోవడంలో బాలికల్లో మనోధైర్యం రావాలన్నారు. అనంతరం బాల్యవివాహాల నిర్మూలనపై పోస్టర్ విడుదల చేశారు. కార్యక్రమంలో మదర్‌సొసైటీ సీఈఓ రామారావు, వరల్డ్ విజన్ ప్రాజెక్టు కో ఆర్డినేటర్ జెస్సి, బాలకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

## ప్రతి పేదవాడికి మెరుగైన వైద్యం

- ఐటీ సెక్రటరీ, జిల్లా స్పెషల్ అధికారి కోన శశిధర్
- 'జగనన్న ఆరోగ్య సురక్ష'పై సమీక్ష


సమావేశంలో మాట్లాడుతున్న కోన శశిధర్

నంద్యాల: ప్రతి పేదవాడికి రూపాయి ఖర్చు లేకుండా ఆరోగ్యాన్ని అందించడమే జగనన్న ఆరోగ్య సురక్ష ప్రధాన లక్ష్యమని ఐటీ సెక్రటరీ, జిల్లా స్పెషల్ అధికారి కోన శశిధర్ అన్నారు. సోమవారం జిల్లాలో వెలుగోడు, నంద్యాల పట్టణాల్లో జరుగుతున్న జగనన్న ఆరోగ్య సురక్ష క్యాంపుల నిర్వహణ పనితీరుపై జాయింట్ కలెక్టర్ రాహుల్‌కుమార్‌రెడ్డితో కలిసి సమీక్షించారు. అనంతరం కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్‌లో వైద్య శిబిరాల నిర్వహణపై సంబంధిత మెడికల్ అధికారులు, నియోజకవర్గ స్పెషల్ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ వైద్య శిబిరాల్లో రోగులకు వైద్య పరీక్షల నిర్వహణ నామకేవాస్తే కాకుండా మెరుగ్గా నిర్వహించి చికిత్సలు అందించాలన్నారు. శిబిరాల్లో పెద్ద వ్యాధులకు గురైన బాధితులను రెఫెరల్ ఆస్పత్రులకు పంపడమే కాకుండా, వాటిని ఫాలో అప్ చేసే బాధ్యతను డాక్టర్లు తీసుకోవాలన్నారు. వైద్య శిబిరాలకు స్థానిక ప్రజా ప్రతినిధులను భాగస్వామ్యం చేసి ప్రజల్లో చైతన్యం తీసుకురావాలని సూచించారు. శిబిరాల్లో అన్ని సదుపాయాలు కల్పించాలన్నారు. వైద్య శిబిరాల్లో గుర్తించిన లోపాలను సవరించుకుంటూ భవిష్యత్తులో పునరావృతం కాకుండా సరి చూసుకోవాలని సూచించారు.

**శిబిరాల్లో 58,000 మందికి వైద్య సేవలు**

ఇప్పటి వరకు గ్రామీణ ప్రాంతాలలో 128, అర్బన్ ప్రాంతాలలో 7 వైద్య శిబిరాలు నిర్వహించి, 58,000 మందికి సేవలందించినట్లు జాయింట్ కలెక్టర్ రాహుల్ కుమార్ రెడ్డి వివరించారు. ఇందులో దీర్ఘకాలిక రోగులను రెఫెరల్ హాస్పిటల్‌కు పంపిస్తున్నట్లు తెలిపారు. డీఎంఅండ్‌హెచ్ఓ డాక్టర్ వెంకటరమణ, డీసీహెచ్ఎస్ డా.జఫ్రుల్లా, డీఆర్ఓ పుల్లయ్య, జిల్లా పరిషత్ డిప్యూటీ సీఈఓ సుబ్బారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

### సేవకులకు సన్మానం


స్వచ్ఛంద సేవా సంస్థల ప్రతినిధులను సన్మానిస్తున్న బహ్మకుమారీలు

నంద్యాల(వ్యవసాయం): నంద్యాల నియోజకవర్గంలో ప్రజలకు సేవలందిస్తున్న పలు స్వచ్ఛంద సేవా సంస్థల సభ్యులను సోమవారం స్థానిక ఎన్‌జీఓ కాలనీలో ప్రజాపిత బ్రహ్మకుమారి ఈశ్వరీయ విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో బ్రహ్మకుమారీస్ సంచాలకురాలు సిస్టర్ సావిత్రి ఘనంగా సన్మానించారు. సిస్టర్ సావిత్రి మాట్లాడుతూ సేవలతో పాటు ఆధ్యాత్మిక విలువలను తెలియపరచడం అభినందించదగ్గ విషయమన్నారు. రాజయోగాన్ని గురించి కుమారి కళ్యాణి యోగసాధన ద్వారా తెలియజేశారు. రోటరీ క్లబ్, వాసవి వృద్ధాశ్రమం, స్నేహ వృద్ధాశ్రమం, ఆయుష్ యోగా కేంద్రం తదితర సంస్థల ప్రతినిధులను సత్కరించారు. కార్యక్రమంలో బ్రహ్మకుమారీస్ డాక్టర్ రామ్మోహన్‌రెడ్డి హరిప్రియ, మాధవస్వామి, జగదీశ్వరరెడ్డి, సతీశ్ పాల్గొన్నారు.

## వడ్డెర్ల సమస్యల పరిష్కారానికి కృషి

నంద్యాల(అర్బన్): వడ్డెరుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని ఏపీ వడ్డెర సంఘం రాష్ట్ర కార్యదర్శి చల్లా వెంకటేష్ తెలిపారు. స్థానిక కార్యాలయంలో సోమవారం నూతన కార్యదర్శిగా చల్లా వెంకటేష్‌ను నియమిస్తూ రాష్ట్ర అధ్యక్షుడు లక్ష్మీకాంతయ్య, ఉపాధ్యక్షులు మద్దిలేటి నియామక పత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో రాష్ట్ర వడ్డెర కార్పొరేషన్ డైరెక్టర్ రామసుబ్బయ్య, మంజుల సుంకన్న, అడ్వకేట్ శ్రీరాములు, శివభాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

## సంక్షిప్తం

**ప్రభుత్వ భూముల ఆక్రమణలపై చర్యలు తీసుకోండి**

నంద్యాల(న్యూటౌన్): జిల్లాలో రియల్ ఎస్టేట్ పేరుతో ప్రభుత్వ భూములను కబ్జాలు చేసి వెంచర్ల ద్వారా ప్రభుత్వ ఖజానాను గండి కొడుతున్న ఆక్రమణ దారులపై చర్యలు తీసుకొని, సమగ్ర విచారణ జరిపించాలని సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి బాబాఫక్రుద్దీన్, పట్టణ కార్యదర్శి ప్రసాద్, ధనుంజయుడు, సుబ్బరాయుడు కోరారు. సోమవారం నంద్యాలలో జరిగిన స్పందన కార్యక్రమంలో డీఆర్ఓకు పలు డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని అందజేశారు. వారు మాట్లాడుతూ ప్రభుత్వ భూములను పేదలకు ఇవ్వాలని కోరారు. అలాగే ఆత్మకూరు ఆర్‌డీఓ ఉద్యోగాలను అమ్ముకుంటున్నారని, చర్యలు తీసుకొని విచారించాలన్నారు. కార్యక్రమంలో సోమన్న, శ్రీనివాసులు, తదితరులు పాల్గొన్నారు.

**జిల్లాను కరువు ప్రాంతంగా ప్రకటించాలి..**

నంద్యాల జిల్లాను కరువు ప్రాంతంగా ప్రకటించాలని కోరుతూ ఏపీ రైతు సంఘం జిల్లా కన్వీనర్ సోమన్న, శ్రీనివాసులు ఆధ్వర్యంలో సోమవారం పత్రాన్ని డీఆర్ఓకు అందజేశారు.

**కార్మిక వ్యతిరేక విధానాలపై రాజీలేని పోరాటాలు**

నంద్యాల(న్యూటౌన్): కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న కార్మిక ఉద్యోగ ప్రజా వ్యతిరేక విధానాలపై రాజీలేని పోరాటాలకు సిద్ధం కావాలని సీఐటీయూ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు ఏసురత్నం, నాగరాజు పిలుపునిచ్చారు. సోమవారం స్థానిక సీఐటీయూ కార్యాలయంలో జరిగిన సమావేశంలో వారు మాట్లాడుతూ కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం బ్రిటీష్ కాలం నుంచి ఉన్న 44 కార్మిక చట్టాలను నాలుగు లేబర్ కోడ్‌లుగా కుదింపు చేసి, కార్మికులకు ఎలాంటి హక్కులు లేకుండా పెట్టుబడి దారులకు, కార్పొరేట్ సంస్థలకు బానిసలుగా చేసేందుకు యత్నిస్తోందన్నారు. కార్యక్రమంలో లక్ష్మణ్, భాస్కరరెడ్డి, ఎల్లయ్య, వెంకటలింగం, రాంనాయక్ తదితరులు పాల్గొన్నారు.

**సర్వే నిర్వహించేందుకు సంసిద్ధం కావాలి**

రుద్రవరం: మండలంలోని 21 గ్రామ పంచాయతీలు 22 మజరా గ్రామాల్లో పంచాయతీ డెవలప్‌మెంట్ ఇండెక్స్ సర్వే నిర్వహించేందుకు అందరు సంసిద్ధం కావాలని తహసీల్దారు రవీంద్ర ప్రసాదు, ఎంపీడీఓ మధుసూదనరెడ్డి సూచించారు. స్థానిక రెవెన్యూ కార్యాలయంలో సోమవారం స్పందన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో నంద్యాల డీపీఓ మంజులవాణి పంచాయతీ డెవలప్‌మెంట్ ఇండెక్స్‌పై వివరించారు. దీంతో మండల అధికారులు పంచాయతీ కార్యదర్శులను అక్కడికే పిలిపించుకొని సమీక్ష నిర్వహించారు. సర్వేను పంచాయతీ కార్యదర్శులు ఆయా శాఖల సిబ్బందితో కలిసి చేయాలని సూచించారు.

**ఎక్స్‌ప్రెస్ రైళ్లలో జనరల్ బోగీలను పెంచాలి**

నంద్యాల(న్యూటౌన్): ఎక్స్‌ప్రెస్ రైలులో జనరల్ బోగీలను పెంచాలని, ప్యాసింజర్ రైళ్లను పునః ప్రారంభించాలని, వందే భారత్ రైలు టికెట్ల ధరలు తగ్గించాలని కోరుతూ ఏఐవైఎఫ్ ఆధ్వర్యంలో సోమవారం స్థానిక రైల్వే స్టేషన్ వద్ద ధర్నా నిర్వహించారు. అనంతరం వినతి పత్రాన్ని రైల్వే మేనేజర్ ధ్వరస్వామికి అందజేశారు. ఏఐవైఎఫ్ నంద్యాల జిల్లా కార్యదర్శి నాగరాముడు మాట్లాడుతూ రైల్వే శాఖ ప్రైవేటీకరణ నిర్ణయాన్ని కేంద్ర ప్రభుత్వం విరమించుకోవాలన్నారు. ప్రయాణికుల భద్రతకు ఎక్కువ ప్రాధాన్యత ఇవ్వాలని, రైల్వే శాఖలో ఖాళీగా ఉన్న ఉద్యోగాలను భర్తీ చేయాలని కోరారు. కార్యక్రమంలో ఏఐవైఎఫ్ నాయకులు మనోహర్, అంజి, వెంకట్, హరి, చంద్ర తదితరులు పాల్గొన్నారు.

**ఈ- పంట నమోదుతోనే ప్రభుత్వ పథకాలు**

నంద్యాల(అర్బన్): ఖరీఫ్ కింద సాగుచేసిన పంటలకు సంబంధించి ఈ- క్రాప్, ఈ-కేవైసీ చేయించుకున్న రైతులకు మాత్రమే ప్రభుత్వ పథకాలు అందుతాయని నంద్యాల ఏఓ ప్రసాదరావు తెలిపారు. ఈ నెల 10వ తేదీ లోగా ఈ-కేవైసీ చేయించుకోవాలని సూచించారు. సోమవారం మండలంలోని మిట్నాల ఆర్బీకేను సందర్శించారు. ఏఓ మాట్లాడుతూ నంద్యాల మండలంలో ఖరీఫ్ సాధారణ సాగు 19 వేల ఎకరాలు కాగా ఇప్పటి వరకు 15 వేల ఎకరాల్లో ఈ క్రాప్ పూర్తయిందన్నారు. అదే విధంగా 13 వేల ఎకరాల్లో ఈ -కేవైసీ చేయించుకున్నారని మిగిలిన రైతులు ఈ -కేవైసీ చేయించుకోవాలని సూచించారు.

**పోస్టల్ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి**

చాగలమర్రి: పోస్టల్ ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలను కేంద్ర ప్రభుత్వం వేంటనే పరిష్కరించాలని పోస్టుమాస్టర్ ప్రభాకర్‌రెడ్డి, ఏఐపీఈయూ గ్రూప్-సి డివిజనల్ కార్యదర్శి మనోజ్ కుమార్ కోరారు. సోమవారం మండల కేంద్రమైన చాగలమర్రిలోని తపాలా శాఖ కార్యాలయం ఎదుట భోజన విరామ సమయంలో ప్లకార్డులతో నిరసన చేపట్టారు. వారు మాట్లాడుతూ ఏపీ సర్కిల్ పరిధిలో మూసి వేయబడిన 30 కార్యాలయాలను వెంటనే తెరవాలని డిమాండ్ చేశారు. పదవీ విరమణ పొందిన తపాలా శాఖ ఉద్యోగులకు రావాల్సిన బెనిఫిట్స్‌ను వెంటనే చెల్లించాలన్నారు. వెంకటేష్ నాయక్, శ్రీనివాసులు, రవి, వెంగళరెడ్డి పాల్గొన్నారు.